
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



క్రైస్తవ తెలుగు మాసపత్రిక

AUGUST - 2002

# సంక్షిప్త వార్తలు

2002 జూలై 31వ తేదీ బుధవారం సామర్లకోట మండలం వెంకటకృష్ణ రాయపురం సత్యవరంపేటలో క్రీస్తుసంఘ సువార్తికుల సదస్సు జరిగెను. పలుగ్రామముల నుండి సువార్తికులు సదస్సుకు సకాలములో హాజరైరి. మరియు "మానవ జీవితంలో మారుమనస్సు యొక్క ప్రాధాన్యత" యను అంశమును చర్చించిరి. సోదరులు టి.వి.యన్. కుమార్ గారు సత్యవరంపేటలో యున్న క్రీస్తుసంఘ చరిత్రను వివరించిరి. సదస్సుకు జాషువా గూటం గారు అధ్యక్షత వహించి నడిపించిరి. ఆ సదస్సులో పలుప్రాంతముల నుండి వచ్చిన సువార్తికులేగాక స్థానిక సంఘసభ్యులు కూడ ఆసక్తితో హాజరైరి. సత్యవరంపేటలో సోదరులు జి. ఆనందకుమార్ గారు సువార్త చాటుచు మంచిపని చేయుచున్నారు. స్థానిక సంఘమును చక్కగా నడిపించుచున్నారు.

సదస్సులో ఇయ్యబడిన అంశముపై సోదరులు జి. షద్రక్ (పాలకొల్లు), యన్.మోజెస్ (కరుగోరుమిల్లి), టి.వి.యన్. కుమార్ (కాకినాడ). యస్.శ్యాంప్రసాద్ (వేళంగి), వి. స్వామినాధన్ (పెద్దాపురం), జాషువాగూటం గార్లు చక్కని వాక్యోపదేశము గావించిరి. సోదరులు కె.ప్రసాద్ (ఆచంట), పి. సంజీవరావ్ (పెద్దాపురం) గార్లు ప్రార్ధనలు చేసిరి. హాజరైనవారందరికీ మంచి భోజనమును స్థానికసంఘము ఏర్పాటుచేసిరి. సోదరులు జి. ఆనందకుమార్ గారు వందన సమర్పణచేసి సదస్సులో పాల్గొనిన వారికందరికీ కృతజ్ఞత తెలిపిరి. సత్యవరంపేటలో సోదరులు టి.వి.యన్. కుమార్ గారి ప్రోత్సాహము వలన ఆనందకుమార్ గారు మంచి ఫలితములను క్రీస్తు కొరకు సాధించ గలుగుచున్నారు.

మానవ జీవితంలో మారుమనస్సు అత్యంత ప్రాధాన్యమైనది. మారుమనస్సు పొందని యెడల మీరందరు నశింతురని యేసు ప్రభువు చెప్పారు. దేవుడు పరిశుద్ధుడు, మానవుడు పాపి, పాపముతో ఆయన సహవాసము చేయడు. గాని మారుమనస్సు పొంది ఆయనకు విధేయత చూపు మానవునితో ఆయన సహవాసము చేయును. ఆయన ఇట్లు చెప్పెను: "దుష్టులు మరణము

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 363722

Editor :

**Joshua Gootam**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 23 ఆగష్టు 2002 సంచిక 1


## దేవుని మనమేల సేవించవలెను

*( Why we should serve God )*

భక్తిహీనత ప్రబలియున్న రోజులలో మనము ఈనాడు నివసించుచున్నాము. దేవుడున్నాడా ? ఆయనను సేవించుటలో మనకు కలసివచ్చే దేమిటి? అసలు దేవుని మనమెందుకు సేవించవలెను? అనే ప్రశ్నలను నేటి ప్రజలు పదే పదే అడుగుచున్నారు. అందువలన బైబిలు బయలుపరచు నిజదేవుడైన యెహోవా దేవుని మనమెందుకు సేవించవలెనో తెలిసికొనుటకు ప్రయత్నము చేయుదము.

### ఆయన పూజార్హుడు

దేవుడు ఈ విశ్వమంతటిలోను ఉన్న ఆత్మయైయున్నాడు. ఆయన నిత్యుడు, సర్వశక్తిమంతుడు, అమిత జ్ఞాని, యెహోవా దేవుడు పరిశుద్ధుడు,

నీతిమంతుడు, యధార్థవంతుడు, ఆయన కరుణగల దేవుడు. ప్రేమాస్వరూపి. అందువలన దేవుని తత్వమును బట్టియే ఆయన స్తోత్రార్హుడు. కీర్తనీయుడైన యెహోవాకు నేను మొర్ర పెట్టుదునని భక్తుడైన దావీదు పలికెను (కీర్తన 18:3). యెహోవా దేవుడు ఆయన ఉనికిని బట్టి, సహజతత్వమును బట్టి కీర్తనీయుడు, స్తోత్రార్హుడు. దేవుడు మానవునికి ఇహలోక సుఖసంపద లిచ్చినను ఇవ్వక పోయినను ఆయన కొనియాడ బడదగిన వాడని యోబు గ్రంధము మనకు బోధించుచున్నది.

యెహోవా దేవుడు స్వయంసమృద్ధుడైనందువలన ఆయన మానవుల సేవ కోరుటలేదని మనము గమనించవలెను. ఆయన అనంతమహాత్మ్యుడైనందు వలన మానవులు చేయు ఆరాధనను బట్టి ఆయన అభివృద్ధి చెందువాడు కాడు. మానవులు దేవుని ఎంత ఎక్కువ ఆరాధించితే దేవుని మహిమ అంత ఎక్కువగుననుకొనుట సత్యము కాదు. దేవుని మహిమ అనంతమైనది. అది ఆయన సహజ లక్షణము. అందుకే యేసుక్రీస్తు ఇట్లు ప్రార్థించెను: "తండ్రీ, లోకము పుట్టక మునుపు నీయొద్ద నాకు ఏ మహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీయొద్ద మహిమ పరచుము" (యోహాను 17:5). మానవుల పరిచర్య వలన యెహోవా మహిమ అభివృద్ధి చెందు నట్టిది కాదు. లోకము పుట్టకమునుపే ఆయన మహిమ గలవాడు.

దేవుడు ప్రేమస్వరూపి యగువాడు గనుక మానవులు నిజ సంతోషమును కలిగియుండవలెనని ఆయన ఆశించుచున్నాడు. అందువలన మానవులు ఆయనను సేవింపవలెనని ఆయన కోరుచున్నాడు. మనము అందు నిమిత్తమే చేయబడితిమి (ప్రసంగి 12:13). సర్వశక్తుడైన దేవుని ఆజ్ఞలకు లోబడకుండా ఎవడును యధార్థ సంతోషమును పొందనేరడు.

## ఆయన సృష్టికర్త

దేవుడు మన సృష్టికర్త, మనము ఆయనచే సృజింపబడినవారము గనుక దేవుని మనము పూజింపవలెను. అత్యధికముగా మనము దేవుని

స్వరూప మందు చేయబడితిమి (ఆది 1:26). శారీరకముగా మనము ఆదాము నుండి కలిగిన పాతము. ఆదామును దేవుడు మంటిలోనుండి తయారు చేసెను. అందువలన "యెహోవాయే దేవుడని తెలిసికొనుడి, ఆయనే మనలను పుట్టించెను (మనలను మనము సృజించుకొనలేదు). మనము ఆయనవారము" అని దావీదు మహారాజు పలికెను (కీర్తన 100:3). కుమ్మరివానికి తాను చేసిన పాత్రలపై ఎట్టి హక్కు యున్నదో దేవునికి మనపై అట్టి హక్కు ఉన్నది (రోమా 9:12).

## మానవుని హీనస్థితి

మానవులు తాము ఉన్న హీనస్థితిని బట్టి తమ్మును తాము దేవుని సేవకొరకు అర్పించుకొనవలసి యున్నది. యుక్తవయస్సు గల వారందరు పాపులు. మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల దేవునినే అబద్ధికునిగా చేయువారమగుదుము (1 యోహాను 1:10). మనము పాపులముగా జన్మించలేదు గాని వయస్సు పెరిగే కొలది శారీరక బలహీనతలకు లొంగి దేవుని నుండి తొలగిపోవుట వలన పాపులమైతిమి. పాపమునకు అలవాటు పడిపోయినందున దానికి దాసులమైతిమి. అందుకే పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని యేసు చెప్పెను (యోహాను 8:34). అందువలన ఈ ఘోర దాసత్వము నుండి మనము విడుదల పొంది బయటపడవలెనంటే పాపమునకు విరుగుడయిన పరిశుద్ధ దేవుని చెంతజేరి ఆయనకు దాసులమగుట మేలని మనకు గ్రహింపు కావలసి యున్నది. ఆ పరిశుద్ధ దేవుడొక్కడు మాత్రమే మనలను పాపపు బానిసత్వము నుండి విడిపించగలవాడు (రోమా 6:17,18). మనము దేవస్వభావ మందు పాలివారము కాగల్గునట్లు దేవుని సేవించవలెను (2 పేతురు 1:4).

సంతోష జీవితమును జీవించుటకుగాను మానవులు దేవుని సేవించవలెను. క్రైస్తవ జీవితమంతయు శోధనలు, శ్రమలు, మాత్రమేనని అపవాది అబద్ధ ప్రచారము చేయుచున్నాడు. క్రీస్తును సేవించుటలో కొన్ని శోధనలు రావచ్చును, నిజమే. క్రీస్తుయేసు నందు సద్భక్తితో బ్రదుక

నుద్దేశించు వారందరు హింస పొందుదురనునది నిజమే (2 తిమో 3:12). అయినను అట్టివారు ఈలోకమందును, పరలోకమందునుపొందు బహుమానములు కలవు. సాత్వికులు ధన్యులు, వారు భూలోకమును స్వతంత్రించు కొందురు అని మన రక్షకుడు వాగ్దానము చేసెను (మత్తయి 5:5). ఈ లోకస్థులెవరు ఎరుగనిరీతిగ క్రైస్తవులు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానమును కలిగి యుందురు. పాపము వలన కలుగు సుఖము తాత్కాలికమైనది. అందువలన మోషే అల్పకాలము పాపభోగము అనుభవించుటకంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించెను (హెబ్రీ 11:26). ఇంకొక మాటలో దుర్మార్గుల జీవితము కఠోరమైనది. శాంతవర్తనమును వారెరుగరు. అయితే నిజదేవుని సేవించువారు క్రీస్తుయేసు నందలి శాంతి సమాధానముల ననుభవింతురు.

దేవుడొక్కడే న్యాయవంతుడు. ఈ లోకములో న్యాయము తీర్చబడుట దుర్లభమని యెరిగి మానవులు దేవుని సేవించవలెను. భక్తిహీనులు క్షేమముగా యుండుట చూచి దావీదు తాను దేవునికి చేయు సేవ వ్యర్థమనుకొనెను (కీర్తన 73:3,13). అతడు దేవుని పరిశుద్ధ స్థలములోనికి పోయి వారి నిజస్థితిని తెలిసికొను వరకు అది అతనికి ఆయాసకరముగా యుండెను (73:17). మనము చేయు ప్రతి పనిని బట్టి దేవుడు మనకు తీర్పుతీర్చునని మానవులు ఎందుకు గ్రహించలేక పోవుచున్నారు? వారి ఆత్మీయ క్షేమము ఈలోక సంపదలపై ఆధారపడి యున్నట్లు వారెందుకు తలంచుచున్నారు? “ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించు కొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము?” అని యేసు ప్రశ్నించెను (మత్తయి 16:26). ఒకడు ఈలోకములో ఎంత సంపాదించు కొనినను తన ఆత్మను పోగొట్టు కొనిన యెడల అతడు సంపాదించుకొనినది శూన్యము. దీనిని నీవు గమనించుము. గనుక దేవుని సేవించుట మేలని యోచించుము.

## నిత్యజీవము కొరకు

తరువాత, నిత్యజీవమును పొందుటకు మానవులు దేవుని సేవించ

వలెను. మానవులు పాపము చేయుట వలన పాపము ఈలోకమందు ప్రవేశించెను. పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసు నందు నిత్యజీవము (రోమా 6:23). "మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందు చున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింప బడుదురు" (1 కొరింధి 15:21,22). అపవాది వలన మరణము ఈలోకమందు ప్రవేశించితే దాని నుండి విడిపించి క్రీస్తునందు దేవుడు మనకు నిత్యజీవము నిచ్చుచున్నాడు. అందుకే యేసుక్రీస్తు ఇట్లనుచున్నాడు: "నామాట విని నన్ను పంపిన వాని యందు విశ్వాస ముంచువాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 5:24).

నీవు క్రీస్తుద్వారా కలుగు నిత్యజీవమును పొందవలెనంటే యేసు దేవుని కుమారుడని విశ్వసించుము. "నేను ఆయనని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు" అని యేసు చెప్పుచున్నారు (యోహాను 8:24). నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము. "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు" అని కూడ యేసు చెప్పుచున్నారు (లూకా 13:5). క్రీస్తునందలి నీ విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనుము. నీవట్లు చేయని యెడల తండ్రియైన దేవుని యెదుట ఆయన నిన్ను ఎరుగనను (మత్తయి 10:33). తరువాత నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. ఆయన నిన్ను రక్షించి పరిశుద్ధాత్మ అను వరమును నీ కనుగ్రహించును (అపొ.కా. 2:38). మరణపర్యంతము నమ్మకముగా ఆయనను నీవు సేవించిన యెడల నిత్యజీవకిరీటాన్ని ఆయన నీకు బహూకరించును (ప్రక 2:10).

*****

# నీవు ఎక్కడ వున్నావు ?

## ( *Where are Thou ?* )

"దేవుడైన యెహోవా ఆదామును పిలిచి నీవు ఎక్కడ వున్నావనెను" (ఆది 3:9).

మానవుని ప్రాధమిక సమస్య అతడెక్కడున్నాడో, ఎక్కడికి వెళ్లుచున్నాడో ఎరుగక యున్నాడు. కావాలంటే అతడు వీటిని ఎరుగ వచ్చును ఏలయనగా మానవుడు ఎక్కడి నుండి వచ్చాడో, ఎక్కడున్నాడో, ఎక్కడికి వెళ్లుచున్నాడో యను సంగతులను బైబిలు విశదముగా అతనికి బోధించుచున్నది. అతనిని సంపూర్ణునిగా చేసే బోధ దానిలో యున్నది (2 తిమో 3:16-17).

మానవుడు తన్ను గూర్చి ఎరిగిన వాడైతే తన స్థితిగతులను అభివృద్ధి చేసికొనగలడు. తప్పిపోయిన కుమారుడు తన నిజస్థితిని (అధోగతిని) తెలిసికొనే వరకు తండ్రి యింటికి వెళ్లలేదు. తానెక్కడయున్నాడో, ఏమిచేసాడో వగయిరాలను గూర్చి బుద్ధి వచ్చే వరకు తన నిజస్థితిని ఎరుగక యుండెను. తండ్రి యింటికి తిరిగివెళ్లే దూరప్రయాణం తనకు బుద్ధి వచ్చే వరకు ఆరంభం కాలేదు. నేడు కూడ అనేకులు అట్టి ప్రమాదకరస్థితిలోనే యున్నారు.

ఆయా స్థితులలో యున్న వారిని గూర్చి తెలిసికొనుచు మన మట్టుకు మనం ఎక్కడ వున్నామో గ్రహించుకొనుటకు ఇప్పుడు ప్రయత్నించుదాం.

## ఆదాము దాగుకొన్నాడు

ఆదాము తాను చేసిన తప్పును ఎరిగినవాడై దాగుకొన్నాడు. మంచి చెడుగుల విచక్షణ జ్ఞానాన్ని అతడు కలిగియుండెను, నిజమే. గాని అతడు పాపపుపక్షాన చేరాడు గనుక ఆ జ్ఞానాన్ని వినియోగించుకోలేకపోయాడు. అందువలన అతడు భయపడి దాగుకొని, తన సిగ్గును కప్పుకొన జూచాడు. గాని దేవుడు ఆదామును పిలిచి "నీ వెక్కడ వున్నావు?" అని ప్రశ్నించారు.

"అందుకతడు - నేను తోటలో నీ స్వరము వినినప్పుడు దిగంబరిగా నుంటిని గనుక భయపడి దాగుకొంటిననెను" (ఆది 3:10). దేవుడు మానవుని వంటివాడేనని తలంచి ఆదాము పొరబడ్డాడు. అతడు హవ్వకు కనబడకుండా దాక్కొన్నాడు. గనుక దేవునికి కూడా కనబడనని తలంచాడు. ఇట్టి తలంపుల వలననే అనేకులు పాపములోబడి నశించు చున్నారు. "అందుకు కేవలము నీవంటి వాడనని నీవనుకొంటివని" దేవుడు మానవులను గద్దించారు (కీర్తన 50:21).

దేవునికి కనబడకుండా మానవుడు దాగుకొనడం అసంభవము. "యెహోవా కన్నులు ప్రతి స్థలము మీదనుండును. చెడ్డవారిని మంచి వారిని అవి చూచుచుండును" (సామె 15:3). "మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క యొప్పచెప్ప వలసి యున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగు లేక తేటగా ఉన్నది" (హెబ్రీ 4:13). చీకటియైనను ఆయనకు మరుగుకాదు (కీర్తన 139:11,12). దేవుని మోసగించాలని మానవుడు చేసే ప్రతి ప్రయత్నము లోను మానవుడే తన్నుతాను మోసగించుకొనుచున్నాడు.

## యోనా దేవుని నుండి పారిపోజూచాడు (యోనా 1:1-3)

నీవు నీనెవకుపోయి దానికి దుర్గతి కలుగునని ప్రకటించుమని దేవుడు యోనాకు చెప్పారు (యోనా 1:2). అది యోనాకు ఇష్టపడలేదు గనుక అతడు యెహోవా సన్నిధి నుండి పారిపోజూచాడు; యొప్పేకుపోయి అక్కడ తర్షీషుకుపోవు ఓడనెక్కాడు. అతడు ఎక్కడవున్నాడో అక్కడే ఎందుకు ఉండలేదు? "నీవు లేచి నీనెవకు వెళ్లుము" అను మాటలు అతని చెవులలో గింగురుమనుచున్నందున అతడక్కడ ఉండలేదు. దేవుని మాటలకు అవిధేయత చూపినందున అతనికి స్థిమితము లేకపోయెను. అందువలననే కాబోలు కొందరు ఆరాధనకు వెళ్లలేరు.

అయితే సముద్రములో కూడ దేవుడుంటాడని యోనా త్వరలో తెలిసి కొన్నాడు (యోనా 1:4). మానవుడు తన నీడ నుండి ఎట్లు తప్పించు కోలేడో

అట్లే దేవుని నుండి తప్పించుకోలేడు. దేవుడు సర్వాంతర్యామి (కీర్త 139:7-10).

దేవుని నుండి, ఆయన ఆజ్ఞల నుండి పారిపోజాలనని కొన్ని గగుర్పాటు పుట్టించు సందర్భాలను బట్టి యోనా గ్రహించుకొన్నాడు (యోనా 1:15-3:4). చివరకు యోనా మార్పుజెందినప్పుడు యితరులను దేవునివైపు మార్చగలిగాడు (యోనా 3:5-10). యోనా యొక్క ప్రకటన ప్రపంచ చరిత్రలో అతిశక్తివంతమైనదని యేసు గుర్తించారు (లూకా 11:32). గాని దేవుని నుండి పారిపోజాలనని మొదట యోనా తెలిసికొనవలసి వచ్చెను.

## అహరోను విగ్రహారాధనలో యుండెను

అహరోను బంగారపు పూతపోసిన దూడను ఒక దాని చేసి, "ఓ ఇశ్రాయేలూ ఐగుప్తు దేశములో నుండి నిన్ను రప్పించిన నీ దేవుడు ఇదే" అని చెప్పెను (నిర్గ 32:1-6). ఆ బంగారుదూడ వారిని ఐగుప్తులో నుండి తీసికొనిరాలేదని అతడెరుగును. ఏలయనగా అతడు "రేపు యెహోవాకు పండుగ జరుగునని చాటించెను" (నిర్గ 32:5). అది దేవుడు కాదు గాని, దేవునికి గురుతుగా ఆ బంగారు దూడ యుండెను. దేవునికి బదులుగా దేనినుంచినా అది విగ్రహారాధనయగును (1 కొరింథీ 10:7). నిజ స్వరూపమునకు ప్రతిగా మానవుడు ప్రతిమను చేయును. అదృశ్య మూర్తికి సమీపముగా యున్నానని గ్రహించుకొనడం కష్టమని అతడు తలస్తాడు. అందు వలన ఆ మూర్తికి ప్రతిగా ఒక స్వరూపమును చేసుకొంటాడు. గాని క్రైస్తవ్యమైతే "వెలిచూపు వలన గాక విశ్వాసము వలన నడుచుకొను నట్టిది" (2 కొరింథీ 5:7).

నిజదేవుని తప్ప వేరొక దేవునిని కలిగియుండరాదని పది ఆజ్ఞలలో ఒక ఆజ్ఞ మానవుని నిషేధించింది (నిర్గ 20:3). విగ్రహారాధనను ఖండిస్తూ యేసు కూడా చెప్పారు (మత్త 4:10).

ప్రతిమలను గాని, తనను తానే ఆరాధించుకొనడం గాని చేస్తే అది విగ్రహారాధన సంబంధమైన అపరాధమే (2 తిమో 3:2; ఫిలిప్పీ 3:19).

ఇహలోక ఆస్థులు, సంతోషము వగయిరాలు కూడ విగ్రహారాధనతో సమానమే (2 తిమో 3:4; కొలస్స 3:5).

## యౌవన ధనవంతుడు దుఃఖములో యుండెను (మత్త 19:16-22)

యేసు అతనికేమి ఆజ్ఞాపించెనో దాన్ని చేయనిష్టపడక అతడు దుఃఖముతో వెళ్లిపోయాడు. పాపము దుఃఖము కలిసిమెలిసే ఉంటాయి. పాపులు పైకి సంతోషంగా ఉన్నట్లే అగుపడినను "మహాభయము చేత వారు కడముట్ట నశించుదురు" అని దావీదు చెప్పాడు (కీర్త 73:19). ఆ ధనికుడైన యువకుడు వ్యసనపడుచు వెళ్లిపోయినను మహాభయము అతని వెంటే యుండెను. ఇది అట్లుండగా విధేయత వలన ఆనందము, సంతృప్తి కలుగును. నపుంసకుడు సువార్తకు విధేయుడై సంతోషముతో తన యింటికి వెళ్లెను (అపొ.కా. 8:39). అట్లే చెరసాల అధిపతి కూడ తన యింటి వారందరితో కలిసి ఆరాధించెను (అపొ.కా. 16:34). అట్లే సువార్త మనకును సహాయం చేయును.

ఈ యువకుడు రక్షణపొందుటకు యేమి చేయాలో తెలిసికొనగోరు చున్నాననుకొన్నాడు, గాని నిజానికి అతడు తెలిసికొనగోరలేదు. తన ఉద్దేశాలతో ఆ ప్రశ్న యొక్క జవాబు ఏకీభవించుచున్నదో లేదో యని అతడు తెలసికొనగోరాడు. మనలో చాలమంది విషయంలో యిది సత్యం ! "పరలోకమందు నీ చిత్తము నెరవేరుచున్నట్లు భూమిమీదను అది నెరవేరునుగాక" యని అట్టి వారు ప్రార్థించుటలేదు (మత్త 6:11).

## లవొదికయులు నులివెచ్చని స్థితిలో యుండిరి (ప్రక 3:15-16)

వారు భక్తిగలవారే గాని, అంతంత మాత్రమే. వారు చల్లగానైనను వెచ్చగా నైననులేరు. వారు కొంతమట్టుకు ప్రభువు వైపు కొంతమట్టుకు అపవాది వైపు యుండిరి. "నీవు చల్లగానైనను వెచ్చగానైనను ఉండిన మేలు" అని ప్రభువు వారితో చెప్పెను. లవొదికయలోని సంఘము నులి

వెచ్చగా యున్నందున "నిన్ను నా నోట నుండి ఉమ్మివేయనుద్దేశించు చున్నానని" ప్రభువు వారితో చెప్పెను.

నాకేమియు కొదువలేదని వారనుకొనిరి గాని నిజానికి వారికి అంతా కొదువే (ప్రక 3:17). ఒకడు తానున్న స్థితికంటే తన్ను గూర్చి ఎక్కువగానే అంచనా వేసుకొనును. మనము దేనిని నమ్ముచున్నామో దానిని గూర్చి వేడిగా వాడిగా యుండాలి. నమ్మకపోతే చల్లగా యుండాలి. గాని క్రైస్తవ్యములో మధ్యేయ మార్గం అంటూ యేమిలేదు (మత్తయి 12:30). నులివెచ్చని క్రైస్తవుడు నిర్దేవుడే. నీవట్లుండకూడదు.

## పౌలు క్రీస్తు శరీరములో యుండెను (1 కొరింథీ 12:13)

క్రీస్తును సంపాదించుకొనుటకు అతడు సమస్తమును నష్టముగా ఎంచుకొనెను (ఫిలి 1:20). మానవ జాతికంతటికీ యున్న సమస్యకు అతని జీవితమే పరిష్కారమార్గమునకు ఒక ఉదాహరణయై యున్నది "నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము" (ఫిలిప్పీ 1:20). నీవు బ్రదికితే క్రీస్తుకొరకే, చనిపోతే లాభము, ఏలయనగా నీవాయనతో యుందువు. నీ జీవిత సమస్యను పరిష్కరించుకొంటే, మరణ సమస్య కూడా అదే పరిష్కరిస్తాది.

## ఇప్పుడెక్కడ వున్నామో అది నిత్యత్వంలో ఎక్కడ వుంటామో నిర్ణయిస్తాది

యిది ధనవంతుడు, లాజరు యొక్క కథనంలో మనకు కనబడతాది (లూకా 16:19-24; ప్రక 14:13).

నీ వెక్కడ ఉన్నావు ? అయితే ఎక్కడ వుంటావు ?

-- లీరోయ్ బ్రాన్లో.

# చెడ్డ సమరయ స్త్రీ

## *( The Bad Samaritan Woman )*

సమరయలోని సుఖారను ఊరికి సుమారు అరమైలు దూరములో యాకోబు బావి ఉండెను. యూదయనుండి గలిలయకు వెళ్లునపుడు యూదులు సమరయను చుట్టివెళ్లుట వాడుక. కాని ప్రభువైన యేసు సమరయగుండా ప్రయాణించి అలసినవాడై ఆ బావియొద్ద కూర్చుండి సేద దీర్చుకొనుచుండెను. ఆయన దేవుని కుమారుడై నప్పటికిని దైవమానవుడు గనుక మనందరివలె ఆయన ఆకలికొనెను, దప్పిగొనెను, ఏడ్చెను. మన అందరివలెనె ఆయన అన్నిబాధలు, శ్రమలయందు శోధనలయందు కూడా సహానుభవము గలవాడై యుండెను. మన ప్రధానయాజకుడు మన బలహీనతల యందు మనతో సహానుభవము లేనివాడుకాడు గాని, సమస్త విషయములలో మనవలె శోధింపబడినను ఆయన పాపములేని వాడుగా యుండెను; గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము (హెబ్రీ 4:15,16).

యేసు ఆ బావి యొద్ద కూర్చుండినప్పుడు శిష్యులు ఆహారము కొనుటకు పట్టణములోనికి వెళ్లిరి. పాపియైనటువంటి సమరయ స్త్రీ యొకతి ఆ బావి యొద్దకు నీళ్లు చేదుకొనుటకు రాగా ప్రభువు ఆమెతో మాట్లాడుచుండెను. ఈ సంభాషణ ఆమెకు మాత్రమే గాక అనేకులు రక్షింపబడుటకు అవకాశము కలిగెను.

## సమరయ స్త్రీ యెడలను, పాపులందరి యెడలను క్రీస్తు యొక్క దృక్పథము :

1. ఈ సమరయ స్త్రీకి ఐదుగురు భర్తలు గలరు కాని అప్పటికి తన భర్త కానివానితో ఆమె జీవిస్తూయున్నది. అందునుబట్టి ఆమె చాల అసభ్య కరమైన జీవితమును జీవించుచున్నది. ఇది సర్వము ఎరిగిన ప్రభువుకు

తెలుసు. ఆయన ఆ స్త్రీ జీవితమును బట్టి అసహ్యించుకొని ఆమెను తృణీకరించలేదు. పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెను (1 తిమోతి 1:15). బావి దగ్గరకు వచ్చిన స్త్రీ రక్షింపబడవల యున్నది. రోగులకే గాని ఆరోగ్యము గల వారికి వైద్యుడక్కరలేదు; మారుమనస్సు పొందుటకై నేను పాపులను పిలువవచ్చితిని గాని నీతిమంతులను పిలువరాలేదు (లూకా 5:31,32).

2. తామే నీతిమంతులమని తలంచే స్వనీతిపరులైన పరిసయ్యులు వ్యభిచార మందు పట్టుబడిన యొక స్త్రీని ప్రభువు దగ్గరకు తీసికొని వచ్చినపుడు ఆయన దృక్పథం వేరుగాయుంది (యోహాను 8:3-11). ఆయన మీద నేరము మోపవలెనని ఆయనను శోధించుచు ఈ స్త్రీని గూర్చి నీవేమి చెప్పుదువని అడిగిన వారిని చూచి, మీలో పాపము లేనివాడు మొట్ట మొదట ఆమె మీద రాయి వేయవచ్చునని చెప్పెను. ఆయన ఆ స్త్రీని విసర్జించలేదు. ఆమెతో కఠినముగా కూడ మాట్లాడలేదు. కాని నీవు వెళ్లి యిక పాపము చేయకుమని చెప్పెను. ఆమెను ప్రభువు దగ్గరకు తీసికొని వచ్చినవారు కూడ పాపులే. అయితే వారు పాపులమని తలంచలేదు వారిలో స్వనీతి యున్నది. ఎదుటివారు నశించుపోవుచుంటే యే విధమైన బాధ్యత వారికి లేదు. ఇటువంటి పరిసయ్యులు ప్రస్తుతం మనలోకూడ యున్నారు.

## వ్యక్తిగతమైన సేవాపరిచర్య చేయుటలో ప్రభువు చూపిన మాదిరి :

1. ప్రతి వ్యక్తి రక్షింపబడవలసి యున్నదని ప్రభువుకు తెలుసు. ఈ సమరయ స్త్రీతో మాట్లాడుట చూచినవారు ఆయనను నిందించెదరేమో యనే సందేహము ఆయనకు కలుగలేదు. ఆమెతో మాట్లాడిన ఆయనకు కలిగే ప్రయోజనము కూడలేదు.

2. ఆయనకు దొరికిన ప్రతి తరుణమును ఆత్మలను రక్షించుటకు సద్వినియోగము చేసికొనెను.

3. దాహమున కిమ్మని ఆ స్త్రీని అడుగుటలో ఆయన తన్ను తాను ఎంతో తగ్గించుకొనెను. ఇది వారి సంభాషణకు దారితీసినది. ఆమె యొక్క అప్పటి అత్యవసరమును ఆయన అదునుగ తీసికొనెను.

4. అప్పుడు ఆమెకు సువార్తను గూర్చి తెలియచెప్పుటకు ప్రారంభించెను. "మరి యెన్నటికిని దప్పిగొననటువంటి నీళ్లు నీకు కావలెనా? అని ఆమెనడిగి ఆమెలో ఆశను జనింపజేసెను. ఈ విధముగ సువార్తను ప్రదర్శించు విధానమును మనలో అనేకులు నిర్లక్ష్యము చేయుచున్నారు. ఆ జీవ జలములను గూర్చి ప్రభువు ప్రస్తావించినపుడు ఆమెలో ఆశలు చెలరేగెను. ఈ బావిలోతైనది. చేదుకొనుటకు కష్టము. కనుక యింత దూరము రానక్కర లేకుండగను, యింత లోతు నీళ్లు చేదుకొన నవసరము లేకుండగను ఆ జీవజలము నాకీయుమని ప్రభువుని అడిగింది.

5. పాపము-రక్షణ అను అంశములను బట్టి ఆ స్త్రీకి చెప్పబడింది. ఆమె పాపియనియు, తన పాపములనుండి విడుదల పొంది రక్షింపబడవలెననియు కుతూహలము ఆమెలో కలుగునట్లు ప్రభువు చేసెను. రక్షింపబడుటకు పూర్వము నాల్గు విషయములను గూర్చిన ఆలోచన ప్రతి వ్యక్తికి ఉండవలెను. 1) నేను పాపిని అని గ్రహింపు యుండాలి. 2) అప్పుడున్న స్థితిలో మరణించినచో పరలోకము చేరలేననే గ్రహింపు 3) పాపముల నుండి పరిహారము పొందుటకు తానేమి చేయవలెను. 4) ఇదే అనుకూల సమయం గనుక సరియైన నిర్ణయమును తీసికొనవలెను.

6. ప్రభువు బోధకు మంచి ఫలితము కలిగింది. సమరయ స్త్రీ ఒక్కతె మాత్రమే రక్షింపబడలేదు గాని యింకను అనేకులు రక్షణ మార్గము లోనికి వచ్చునట్లు చేయగలిగింది.

7. ఇది ప్రభువు శిష్యులకు ఒక గొప్ప గుణపాఠముగ యున్నది. తరుణము నీయబడినపుడు వాటిని సద్వినియోగము చేసికొనుట. ఇదిగో మీ కన్నులెత్తి పొలములను చూడుడి. అవి యిప్పుడే కోతకు సిద్ధముగ

యున్నవి. విత్తువాడును కోయువాడును కూడ సంతోషించునట్లు కోయువాడు జీతము పుచ్చుకొని నిత్యజీవార్థమైన ఫలము సమకూర్చు కొనుచున్నాడు (యోహాను 4:35,36). మీరు మీ కన్నులు విప్పి నేను చేసిన రీతిని మీకును ఈయబడే తరుణములను సద్వినియోగము చేసుకొనుడని ప్రభువు శిష్యులతో చెప్పెను. ఈ జీవజలము యొక్క అవశ్యకత ఎంతో మందికి ఉన్నది.

## వ్యక్తిని మార్చగలిగే దేవుని శక్తిగల మాట :

సమరయ స్త్రీ చాల చెడు జీవితములో యున్నను ప్రభువు చెప్పే మాటలు వినుటకు ఆసక్తిని కనుబరిచింది. క్రీస్తు ప్రభువును రక్షకునిగ నిరాకరించిన అనేకమంది కంటె ఈ స్త్రీ యొక్క హృదయము ప్రభువు మాటల యెడల ఎంతో ఆసక్తిని కనుబరచింది. తన నిజస్థితిని గూర్చి తాను యేమి ఆలోచన లేకుండా యుండినదో దానికొరకు ఆమె ఆశించుట్లు ప్రభువు మాటలున్నవి. వ్యభిచారియైన స్త్రీ రక్షింపబడి అనేకుల రక్షణకు కారకురాలయ్యినది. ఈ దినములలో అనేకులు పాపమునకు దాసులై దానిచే ఈడ్వబడుచుండగా వారుయెన్నడు ఊహించని రీతిగా వారికి విమోచనము కలిగించేది క్రీస్తు సువార్త మాత్రమే.

మార్చబడిన సమరయ స్త్రీ తాను పొందిన జీవజలమును గూర్చి అనేకులకు తెలియపరచుటకెంతో ఆశించినది. ఆత్రుత కలిగియుండి తన కుండను కూడ బావి యొద్ద విడిచి వెళ్లి ఆ ఊరిలోని అనేకులను ప్రభువు దగ్గరకు తీసుకొని వచ్చినది. నిజముగ రక్షింపబడినవారు ఊరకనే నెమ్మదిగ యుండలేరు. ఈ స్త్రీ చెప్పిన మాటలను బట్టి అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి. ఆయన మాటలు వినినవారు కూడ అనేకులు స్త్రీని బట్టికాక ఆయన మాటలను బట్టియే ఆయన యందు విశ్వాస ముంచిరి. తమ యొద్ద ఉండుమని సమరయులు ఆయనను వేడుకొనుటను బట్టి ఆయన రెండు దినములుండెను. అనేకులు నమ్మి ఆ స్త్రీని చూచి ఇకమీదట నీవు చెప్పిన మాటను బట్టికాక, మా మట్టుకుమేము విని, ఈయన

నిజముగా లోక రక్షకుడని తెలిసికొని నమ్ముచున్నామనిరి (యోహాను 4:39-42). తన పాత జీవితము ఎంత ఘోరమైనదైనప్పటికిని యేసు ప్రభువును రక్షకునిగ అంగీకరించిన తరువాత ఆ వ్యక్తి అనేకుల రక్షణకు కారకుడౌతాడు.

1. దేవుని యెడల తృష్ణ ఆసక్తి-వీటికి సాదృశ్యముగ సమరయ స్త్రీ గలదు. మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదు గాని దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాటవలన జీవించును (మత్తయి 4:4). మానవులకు శరీరావసరతలు తీరుట ఎంత అవసరమో దేవుని యెడల తృష్ణ తీర్చుకొనుటయు అంతే అవసరము. కనుకనే దావీదు మహారాజు నా ప్రాణము దేవుని కొరకు తృష్ణగొనుచున్నది. జీవము గల దేవునికొరకు తృష్ణగొనుచున్నది (కీర్తనలు 42:2) అని అంటున్నాడు. నేనిచ్చు నీళ్లు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్లు జీవనమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా యుండును (యోహాను 4:14) అని మన ప్రభువైన యేసు చెప్పుచున్నారు. ఈ జీవ జలమును ఒకడు ఎట్లు సంపాదించ గలడు? నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు. వారు తృప్తిపరచ బడుదురు (మత్తయి 5:6). నీతి యనగానేమి? నీ యాజ్ఞలన్నియు న్యాయములు (కీర్తనలు 119:172). జీవజలముపొందిన యే వ్యక్తి యైనను దేవుని యొక్క ఆజ్ఞలకు, కట్టడలకు విధేయులై యుండాలి. దప్పిగొనిన వారలారా నీళ్లయొద్దకు రండి. రూకలు లేని వారలారా మీరు వచ్చికొని భోజనము చేయుడి రండి ! రూకలు లేకపోయినని ఏమియు ఇయ్యకయే ద్రాక్షారసమును, పాలను కొనుడి (యెషయ 55:1).

2. ఆత్మతోను, సత్యముతోను ఆరాధించుటను గూర్చి ప్రభువు ఈ స్త్రీకి బోధించెను. క్రైస్తవ్యమునకు ఎంతో అవసరమైనట్టియు, మిక్కిలి ప్రాముఖ్యమైనట్టియు నైన బోధను ప్రభువైన క్రీస్తు జనసమూహములకు గాక ఒక్క వ్యక్తికి బోధించెను. ఈ సమరయ స్త్రీ ఎంత పాపియైనప్పటికిని సత్యముతో దేవుని ఆరాధించుటను ఆమెకు బోధించెను. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించ వలెను (యోహాను 4:24).

1. **ఆత్మతో ఆరాధించుట** :- దేవుడు ఆత్మ, మానవుడు ఆ గొప్ప ఆత్మచే సృష్టించబడిన ఆత్మ. దేవుని మందిరమునకు వెళ్లుట యనేది దేవునిని ఆరాధించుటకు గల యొక అవకాశము. ఆరాధన యనేది మానవుని ఆత్మకును, దానిని సృష్టించిన సృష్టి కర్తకును గల సంబంధము.

2. **సత్యముతో ఆరాధించుట** :- దేవుని ఆరాధించుట ఆత్మతోను, సత్యముతోను యుండవలెను. సత్యముతో ఆరాధించుట యనగానేమి? సత్యము అనగానేమి? నీవాక్యమే సత్యము (యోహాను 17:17). ఆరాధన దేవుని వాక్యానుసారముగ యుండవలెను. ఏదో ఒకరకమైన ఆరాధన సరిపోదు. కయీను సత్యము కానట్టి రీతిగ దేవుని ఆరాధించాడు. దేవుడు చెప్పిన రీతినిగాక తన స్వంత యిష్టప్రకారము ఆరాధించుటకు ప్రయత్నించాడు, తన ఆరాధనను దేవుడు నిరాకరించాడు. దేవుడు నిరాకరించాడు. దేవుని ఆరాధించుటకు హృదయములో ఆశయుండిన ఆయన ఆజ్ఞలన్నిటిని మనము గైకొనేవారముగ యుంటాము. అనగా ఆయన చెప్పినట్లు చేస్తాము. దేవుని ఆజ్ఞ ప్రకారము కాక వేరు విధముగ దేవుని ఆరాధించినచో కయీను యొక్క ఆరాధనను త్రోసిపుచ్చినట్లు అట్టి ఆరాధనను కూడ దేవుడు త్రోసిపుచ్చును.

-- లోటీ బెత్ హోబ్.

గమనిక : మీరు సత్యవాక్కు కొరకు చందా గాని, కానుక గాని పంపారా? లేకపోతే వెంటనే పంపించండి. సత్యవాక్కు ఒకటి కంటే ఎక్కువ ప్రతులు మీకు అందుచున్న యెడల దయచేసి వెంటనే మాకు తెలియజేయండి.

-- ఎడిటర్.

# సువార్తకు లోబడుట

## ( Obeying the Gospel )

సువార్తకు లోబడుట అనుపదము క్రొత్తనిబంధనలో మనకు పదేపదే కన్పడుచున్నది. మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికి ఆయన మరల వచ్చునప్పుడు ప్రతిదండన జరుగునని 2 థెస్స 1:7లో వ్రాయబడి యున్నది. మరల, "తీర్పు దేవుని ఇంటి యొద్ద ఆరంభమగు కాలము వచ్చి యున్నది; అది మనయొద్దనే ఆరంభమయితే దేవుని సువార్తకు అవిధేయులైనవారి గతి యేమవును ?" అని 1 పేతురు 4:17లో వ్రాయబడి యున్నది. సువార్తకు లోబడుట అసాధ్యమని కొందరు వాదింతురు గాని బైబిలు అయితే సువార్తకు లోబడుట, విధేయులగుటను గూర్చి బోధించు చున్నది. సువార్తలో నమ్ముటకు వాస్తవములు, లోబడుటకు ఆజ్ఞలు ఉన్నవి.

## వాస్తవములు

సువార్తలోని వాస్తవములను ఒకసారి బైబిలు నుండి చూచుకొందము. పౌలు ఇట్లు పలుకుచున్నాడు: "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరుచు చున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు.. అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి బొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను' ' (1 కొరింథీ 15:1-3). సువార్తలోని వాస్తవములు ఏమిటి? అవి క్రీస్తు మృతిబొందెను, సమాధి చేయబడెను, మూడవ దినమున తిరిగి లేపబడెను అనునవి. అయితే రోమాలో యున్న క్రైస్తవులకు పౌలు ఇట్లు వ్రాసెను: "మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగా లోబడినవారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైరి; ఇందుకు దేవునికి స్తోత్రము" (రోమా 6:17,18). వారిలో ఈ మార్పు ఎట్లు కలిగెను? వారు ఒక ఉపదేశక్రమమునకు

హృదయపూర్వకముగా లోబడినందున ఈ మార్పువారిలో కలిగెను. ఇక్కడ చెప్పబడిన ఉపదేశక్రమమే క్రీస్తు యొక్క మరణము, సమాధి, పునరుత్థానముల వాస్తవములు. అయితే ఈ వాస్తవములకు వారు ఎట్లు లోబడగల్గిరి? వారు తమ పాపముల విషయమై మృతిబొందిరి. బాప్తిస్మము ద్వారా నీటి సమాధిలో పాతిపెట్టబడిరి. దానినుండి తిరిగిలేపబడిరి.

ఈ సంగతినే పౌలు రోమా 6వ అధ్యాయములో వారికి తెలియ జేసెను. "అలాగైన ఏమందుము? కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచి యుందుమా? అట్లనరాదు. పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించుదుము ? క్రీస్తు యేసు లోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, అలాగే మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గలవారమైన, యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండటకు పాప శరీరము నిరర్థకమగునట్లు మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము" (రోమా 6:1-6). రోమాలో యున్న క్రైస్తవులు విధేయత చూపిన ఉపదేశమేయిది. అంతేకాదు ఎప్పుడైనా ఎవరైన సువార్తకు లోబడినప్పుడు వారు క్రీస్తు యేసు యొక్క మరణ, సమాధి, పునరుత్థానముల ఉపదేశక్రమమునకు లోబడుదురు.

## ఆజ్ఞలు

సువార్త యొక్క ఆజ్ఞలు క్రీస్తు యేసు యొక్క మరణ, సమాధి, పునరుత్థానములకెట్లు సంబంధించి యున్నవో ఇప్పుడు చూచెదము: "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింప బడును" అని

ప్రభువే అపొస్తులుల కాజ్ఞాపించెను (మార్కు 16:15,16). ఆ యాజ్ఞను మత్తయి ఇట్లు వ్రాసెను: "కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదా కాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:19,20).

సువార్త లోకమందంతటా బోధింపబడవలెనని, రక్షింపబడుటకు ఆ సువార్త ఆజ్ఞలకు ఒకడు లోబడవలెనని ప్రభువు ఇక్కడ చెప్పుచున్నారు. ప్రభువు యొక్క ఆజ్ఞ ప్రకారము అపొస్తులులు యెరూషలేము నుండి సువార్త బోధింపనారంభించిరి. యేసు నిజముగా దేవుని కుమారుడను అనేక ఋజువులను వారు ప్రజలకు సమర్పించిరి. వారా సంగతుల యధార్థతను నమ్మినప్పుడు, సహోదరులారా, మేమేమి చేతుము? అని వారు అపొస్తులుల నడిగిరి (అపొ.కా. 2:37). వారు ఏమి చేయవలెనో పేతురు వారికిట్లు జవాబిచ్చెను. "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొ.కా. 2:38). "కాబట్టి అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి" (అపొ.కా. 2:41).

సువార్త యిచ్చు ఆజ్ఞలేవి? మొదటిగా ఒకడు సువార్త వినవలెను. అతడు దేవుని యందు విశ్వసించవలెను. యేసు దేవుని కుమారుడని నమ్మవలెను. తరువాత అతడు తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను. తన విశ్వాసమును మనుష్యుల యెదుట నోటితో ఒప్పుకొనవలెను. తన పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచబడవలెను.

సువార్త యిచ్చు ఈ ఆజ్ఞలకు లోబడుటలో ఒకడు తన పాపముల విషయమై మృతిబొందును. అనగా సువార్తను వినగా క్రీస్తునందున్న విశ్వాసమును బట్టి అతడు తన పాపములను సంపూర్తిగా విసర్జించును.

అతడు పాపముల నుండి ఎడబాటుపొందును. ఇది పాపముల యెడల మరణము పొందుటను సూచించును. మరణము తరువాత సమాధి జరుగవలెను. ఇది నీటి సమాధి. బాప్తిస్మము పొందునపుడు ఒకడు నీటిలో సంపూర్తిగ ముంచబడును. "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్ట బడిన వారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" యని కొలస్స 2:12లో వ్రాయబడి యున్నది. క్రీస్తు సమాధిని జయించి ఎట్లు లేచెనో దానికి సాదృశ్యముగా బాప్తిస్మము పొందువాడు నీటి సమాధి నుండి లేపబడును. సువార్త యిచ్చు ఆజ్ఞలలో దేనిని మనము నిర్లక్ష్యము చేయరాదు. సువార్త ఆజ్ఞలకు లోబడిన తరువాతనే ప్రభువు ఒకని రక్షించి తన సంఘముతో చేర్చుకొనును.

అందరికీ సువార్త బోధింపబడవలెను. అందరు సువార్తకు లోబడవలెను అని ప్రభువు కోరుచున్నారు. "అందరు సువార్తకు లోబడలేదు" అని పౌలు రోమా 10:16లో విచారించుచున్నాడు. అయితే సువార్తకు విధేయులు కాని వారికి ప్రతిదండన తప్పదని అతడు హెచ్చరించుచున్నాడు. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్షవిధింప బడునని క్రీస్తు చెప్పెను. "కావున మనము వినిన సంగతులను విడచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగి యుండవలెను. ఎందుకనగా దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడినందున, ప్రతి అతిక్రమమును, అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొందియుండగా ఇంతగొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల యేలాగు తప్పించుకొందుము?" (హెబ్రీ 2:1-2). నీవు సువార్తకు లోబడితివా ? లేనియెడల ప్రభువైన యేసునందు విశ్వాస ముంచుము, పాపముల విషయమై మారుమనస్సు నొందుము. యేసు నామమును ఒప్పుకొనుచు పాపక్షమాపణ నిమిత్తము ఈనాడే బాప్తిస్మము పొంది, సువార్తకు విధేయుడవై ధన్యుడవు కమ్ము.

-- జాషువా గూటం.

S.S. Channel
7-00 to 7-30 A.M.
(Every Sunday

క్రీస్తుసంఘములు సమర్పించుచున్న

" సత్యవాణి " కార్యక్రమమును

**S.S.** T.V. లో చూడండి.

ఇప్పుడు **S.S.** ఛానల్‌లో ఆగష్టు 25వ తేదీ ఆదివారం మొదలు ప్రతి ఆదివారం ఉదయం గం॥ 7.00 నుండి 7.30 వరకు చూడండి. మీ బంధుమిత్రులతో కలసి టి.వీ. ద్వారా సువార్త వినండి.

ప్రసంగీకులు : జాషువా గూటం

నొందుటచేత నాకేమాత్రమైనను సంతోషము కలుగునా? వారు తమ ప్రవర్తనను దిద్దుకొనుటయే నాకు సంతోషము. ఇదే ప్రభువగు యెహోవా వాక్కు" (యెహెజ్కేలు 18:24). "మరణము నొందువాడు మరణము నొందుటను బట్టి నేను సంతోషించు వాడనుకాను. కావున మీరు మనస్సు త్రిప్పుకొనుడి అప్పుడు మీరు బ్రదుకుదురు; ఇదే ప్రభువగు యెహోవా వాక్కు" (యెహెజ్కే 18:32). మననుష్యులందరు అంతట మారుమనస్సు పొందవలెనని ఆయన ఆజ్ఞాపించుచున్నారు (అపొ.కా. 17:30). మానవుడు యేసు ప్రభువునందు విశ్వసించి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, తన విశ్వాసాన్ని మనుష్యుల యెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల రక్షింపబడును.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002

From:

**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

To

Edited & Published by Joshua Gootam & Published at SATYA VANI, Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada -533 004.